నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 14 ఏప్రిల్ 2025 | SIDDIPET

సిద్దిపేటలో రజతోత్సవ సన్నాహక సమావేశంలో హరీశ్‌రావుతో యువకులు, విద్యార్థులు

గులాబీ జెండాకు యువత గుండెకాయ

- ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల భర్తీ బోగస్
- నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్
- నిరుద్యోగుల బాధలు రాహుల్‌గాంధీకి పట్టవా..
- సిద్దిపేటలో విద్యార్థి, యువత సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 13: యువత, విద్యార్థులు గులాబీ జెండాకు గుండెకాయలాంటి వారని, సిద్దిపేట నుంచి పార్టీ రజతోత్సవ సభకు వెయ్యిమంది యువత, విద్యార్థులు పాదయాత్రగా తరలుదామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో యువత, విద్యార్థి సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట నుంచి చేసే పాదయాత్ర సిద్దిపేట 25 ఏండ్ల గులాబీ జెండాకు స్ఫూర్తి అన్నారు. కాంగ్రెస్ ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల భర్తీ అంతా బోగస్ అని ఆయన విమర్శించారు. 6వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయకుండా 55 వేలు భర్తీ చేసినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగ యువతను నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమ చూపి నిరుద్యోగులను ఎన్నికల ముందు వాడుకొని వదిలేసిందన్నారు. గద్దెనెక్కిన తర్వాత నిరుద్యోగుల గుండెల మీద తన్నుతున్నదని అన్నారు. ఆనాడు నిరుద్యోగుల కోసం ప్రొఫెసర్ కోదండరామ్, రియాజ్, బల్మూరి వెంకట్, మురళి, రేవంత్‌రెడ్డి తదితరులు అశోక్‌నగర్‌లో కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరిగారని, బస్సు యాత్రలు చేశారని, రాహుల్ గాంధీని అశోక్‌నగర్‌కు తీసుకువచ్చి ప్రామిస్‌లు చేయించారన్నారు. వీరికి మాత్రం ఉద్యోగాలు వచ్చాయని, నిరుద్యోగులకు మాత్రం రాలేదని హరీశ్‌రావు అన్నారు. రాహుల్‌గాంధీ అశోక్‌నగర్‌కు వచ్చి 2 లక్షల ఉద్యోగాలు ఏడాదిలో భర్తీ చేస్తామని హామీ ఇచ్చి ఏడాదిన్నర పూర్తయిందని, ఎందుకు జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీకి నిరుద్యోగుల బాధలు కనపడడం లేదా, వినపడడం లేదా అన్నారు. నిరుద్యోగ భృతి ఉట్టి మాటే అన్నారు. రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని హరీశ్‌రావు కోరారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నిమ్మ రజనీకాంత్‌రెడ్డి, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు మహిపాల్‌గౌడ్, బీఆర్ఎస్‌వీ మాజీ అధ్యక్షుడు మెరుగు మహేశ్, నాయకులు భానుచందర్‌గౌడ్, రవి, గుజ్జ రాజు, వేణు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దిపేట సన్నాహక సమావేశానికి హాజరైన యువకులు, విద్యార్థులు

అల్పాహారం తిని విద్యార్థినులకు అస్వస్థత

కౌడిపల్లి, ఏప్రిల్ 13: మెదక్ జిల్లా కౌడిపల్లిలోని సమీకృత బాలికల వసతిగృహ హాస్టల్‌లో 30మంది విద్యార్థినులు కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్‌లో మూడు నుంచి పదో తరగతి వరకు 97మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఆదివారం ఉదయం 8గంటలకు రోజు మాదిరిగానే ఇడ్లీ తిన్నారు. తిన్న తర్వాత కొద్దిసేపటికి ఒక్కొక్కరు కడుపునొప్పికి గురై వాంతులు చేసుకున్నారు. వెంటనే సమీపంలోని ప్రభుత్వ దవాఖానలో విద్యార్థినులకు చికిత్స చేయించారు. విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా, కొంతమంది దవాఖానకు వచ్చి పిల్లలను చూసి ఆందోళనకు గురయ్యారు. హాస్టల్‌లో 97మంది విద్యార్థినులు ఉండగా, 30మంది అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి శ్రీరాం, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శశికళ ఆస్పత్రికి చేరుకొని విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాత్రి మరో 12మందికి వాంతులు, కడుపునొప్పి రావడంతో ఆస్పత్రిలో చికిత్స చేసి పంపించగా ఒకరికి విషమంగా ఉండడంతో ఆస్పత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. మిగితా విద్యార్థినుల పరిస్థితి నిలకడగా ఉంది.

ఆసుపత్రిలో చికిత్స పొందిన విద్యార్థులు

వరంగల్ సభకు దండులా తరలివెళ్దాం

ఎల్కతుర్తి సభను విజయవంతం చేద్దాం

- ప్రతి ఒక్కరినీ కలిసి సభకు ఆహ్వానించాలి
- మనం ఉద్యమకారులం.. క్రమశిక్షణతో సక్సెస్ చేయాలి
- కేసీఆర్ స్పీచ్ వింటే కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపు అయితది
- కాంగ్రెస్ సర్కారు అన్నింటా విఫలం
- హామీలు ఎగ్గొట్టి.. అబద్ధాలతో కాలం గడుపుతున్న సీఎం రేవంత్
- స్థానిక ఎన్నికల్లో గెలుపు మనదే..
- రానున్న రోజులు మనవే
- గజ్వేల్ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్, ఏప్రిల్ 13: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి లక్షమంది జనసమీకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, పార్టీ శ్రేణులు సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని శోభాగార్డెన్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సభ ఎంతో ప్రతిష్టాత్మకమైందని, ప్రతి కార్యకర్త సమయానికి ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. కేసీఆర్ స్పీచ్ విని జైతెలంగాణ అన్న తర్వాతనే అక్కడి నుంచి ఇంటికి చేరుకోవాలన్నారు. క్రమశిక్షణ కలిగిన ఉద్యమకారులం మనం అని, అదే క్రమశిక్షణతో సభకు చేరుకొని విజయవంతం చేయాలని కోరారు. రేవంత్ సర్కార్ హామీల విస్మరణపై గ్రామాల్లో చర్చ పెట్టాలని క్యాడర్‌కు సూచించారు. ఎంత స్పీడ్‌గా కాంగ్రెస్ గెలిచిందో, అంతే స్పీడ్‌గా ఆదరణ కోల్పోయిందని, ఎప్పుడు ఎన్నికలు పెట్టినా మనమే గెలుస్తామని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ పాలనలో అన్ని వ్యాపారాలు దెబ్బతిన్నాయని, ఎవరిని కదిలించినా పరేషాన్‌లో ఉన్నట్లు తెలిపారు. కొడుకో, కూతురో పెండ్లి చేద్దామంటే ఉన్న ఇల్లు కుదవ పెడతామన్నా ఎక్కడ పైసా పుట్టని పరిస్థితి ఉందన్నారు. ప్రజలు రేవంత్ పాలనపై విసిగిపోయారని, గజ్వేల్‌లో 20వేల మంది రైతులకు ఇంకా పంట రుణమాఫీ కాలేదన్నారు. చిన్నకోడూరు మండలంలో 7300 మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదని తెలిపారు. గ్రామాల్లో కేసీఆర్ హయాంలో ప్రతి కులానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టామని, అందరినీ సభకు ఆహ్వానించాలన్నారు. జూన్, జూలైలో స్థానిక సంస్థలకు ఎన్నికలు రాబోతాయని, ఈ సభకు వచ్చిన వారు కేసీఆర్ ప్రసంగం వింటే అంతే ఉత్సాహంతో పనిచేస్తారన్నారు. గజ్వేల్ నియోజకవర్గం నుంచి 15వేల మంది జనసమీకరణ లక్ష్యంగా కాగా, టార్గెట్‌కు మించి సభకు ప్రజలను తరలించాలని, మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నేతలకు హరీశ్‌రావు ఆదేశించారు.


గజ్వేల్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

భవిష్యత్ గజ్వేల్‌దే...

ఏమీ కోల్పోయామో ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నదని, ఎవరు దిగులు పడొద్దని, భవిష్యత్ గజ్వేల్‌దే అని హరీశ్‌రావు అన్నారు. స్థానిక ఎన్నికల్లో రెండు మున్సిపాలిటీలు, అన్ని మండలాల్లో మనమే గెలుస్తామని, బీజేపీకి ఒక్క సీటు వచ్చే పరిస్థితి లేదన్నారు. గజ్వేల్‌లో కేసీఆర్ హయాంలో ఇండ్లు, దుకాణాలు కిరాయికి దొరికేవి కావని, ఇప్పుడు ఎటుచూసినా ఇండ్లు, దుకాణాలకు టూ లేట్ బోర్డులు కన్పిస్తున్నాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై అన్నివర్గాలు విగిసిపోయారన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేయకుండా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రేవంత్ సర్కార్ అబద్ధాలతో కాలం గడుపుతుందని ధ్వజమెత్తారు. కేసీఆర్ నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో గురుకులాలు ఏర్పాటు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. అనంతరం వరంగల్ సభకు సంబంధించిన కరపత్రాలను హరీశ్‌రావు ఆవిష్కరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు రాజమౌళి, రవీందర్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు దేవీ రవీందర్, నాయకులు శేఖర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, యాదగిరి, మండలాల పార్టీ అధ్యక్షులు బెండ మధు, కరుణాకర్‌రెడ్డి, నవాజ్‌మీరా, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ సన్నాహక సమావేశానికి హాజరైన ముఖ్య కార్యకర్తలు

కూలి అందజేస్తున్న వ్యవసాయ క్షేత్రం యజమాని ఎండీ అజాం

కూలి పనిచేసిన బీఆర్ఎస్ నేతలు

నంగునూరు, ఏప్రిల్ 13: ఈనెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం ఆ పార్టీ నేతలు కూలిపని చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని ఘనపూర్‌లో బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో బహిరంగ సభ ఖర్చుల నిమిత్తం ఎండీ అజాం వ్యవసాయ క్షేత్రంలో కూలి పనిచేశారు. అజాం తనవంతుగా రూ. 10వేలు కూలి చెల్లించాలి. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరెడ్ల లక్ష్మీరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు విజయ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ బాలనర్సు, కిరణ్, మన్నె బాబు, అనిల్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, మహేశ్, రాజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేశ్, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువ వైద్యులు రోగుల గుండెల్లో నిలవాలి

- ఉత్తమ సేవలందించి మంచి పేరు సంపాదించాలి
- తెలంగాణ వచ్చాక చేరువైన వైద్యవిద్య
- కేసీఆర్ కృషితో 29 మెడికల్ కళాశాలలు ఏర్పాటు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సురభి వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ స్నాతకోత్సవం

సిద్దిపేట, ఏప్రిల్ 13 : వైద్యవిద్య విజయవంతంగా పూర్తిచేసి పట్టాలు అందుకున్న యువవైద్యులు ఉత్తమ సేవలు అందించి రోగుల గుండెల్లో గూడుకట్టుకోవాలని, పదికాలాల పాటు గుర్తుండేలా సేవలు అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేటలోని సురభి వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ స్నాతకోత్సవానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు వైద్యవిద్య కొందరికే పరిమితం అయ్యిందని, నేడు సిద్దిపేటలో పేద దర్జీ నలుగురు బిడ్డలు నేడు వైద్య విద్య చదువుతున్నారంటే తెలంగాణలో వైద్యవిద్యను బలోపేతం చేయడమే కారణం అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో స్థానికులకు వైద్యవిద్య అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు 70 ఏండ్లలో రెండు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు జరిగితే, స్వరాష్ట్రంలో 9 ఏండ్లలో 29 మెడికల్ కాలేజీలు కేసీఆర్ ఏర్పాటుచేసి దేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించినట్లు తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో, డాక్టర్ల తయారీలో తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. గతంలో చైనా, ఉక్రెయిన్, రష్యా, యూరప్ దేశాలకు వెళ్లి, పరిచయం లేని భాషలో అపసోపాలు పడుతూ మన పిల్లలు ఎంబీబీఎస్ చదివారని, ఇప్పుడు ఆ బాధ తప్పిందన్నారు. కొత్తగా వచ్చిన మెడికల్ కాలేజీలు, లోకల్ రిజర్వేషన్ కారణంగా తెలంగాణ విద్యార్థులకు అవకాశాలు పెరిగాయన్నారు. 'మెడిసిన్స్ క్యూర్ డిసీజెస్, బట్ ఓన్లీ డాక్టర్స్ కెన్ క్యూర్ పేషెంట్స్'. రోగులతో ప్రేమగా మాట్లాడితే వారి వ్యాధి సగం తగ్గుతుంది. మందులు రోగాన్ని నయం చేస్తే, వైద్యులు మాత్రమే రోగిని పూర్తి ఆరోగ్యవంతున్ని చేస్తారని హరీశ్‌రావు అన్నారు. ఎన్ని మందులు ఇచ్చామనే దానికంటే, ఎంత ప్రేమగా మాట్లాడారు. వైద్యులు ఇచ్చే ధైర్యం సగం రోగాన్ని తగ్గిస్తుందన్నారు. ప్రాణం పోసేది అమ్మ అయితే, పునర్జన్మ నిచ్చేది వైద్యుడు మాత్రమే అన్నారు. యువ వైద్యులు వైద్యవృత్తికి మరింత గౌరవాన్ని తేవాలని కోరారు. సురభి దవాఖానలో క్యాత్ లాబ్ ఏర్పాటుచేసి కార్డియాక్ సేవలు అందించాలని, క్యాన్సర్ కీమోథెరఫీ, రేడియోథెరపీ సేవలు అందుబాటులోకి తేవాలని హరీశ్‌రావు కోరారు.

సురభి వైద్య కళాశాలలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

పట్టాలు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

అగ్గిరాజుకుంటే బుగ్గే!

ఆసియాలోనే అత్యధిక పరిశ్రమలున్న ప్రాంతం పటాన్‌చెరు

- తరుచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- కళ్లెదుటే ఆస్తులు కాలి బూడిద
- పటాన్‌చెరులో ఒకటే అగ్నిమాపక కేంద్రం దిక్కు
- జిన్నారం, గుమ్మడిదల ప్రాంతాల్లో అగ్నిమాపక కేంద్రాలు లేక ఇక్కట్లు
- పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే ఇక అంతే..
- వేసవిలో రసాయన పరిశ్రమల్లో ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం
- జిన్నారం, గుమ్మిడిదలలో అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు పరిశ్రమల వర్గాల వినతి

పటాన్‌చెరు, ఏప్రిల్ 13: ఆసియా ఖండంలోనే అత్యధిక పరిశ్రమలున్న పటాన్‌చెరు ప్రాంతంలో అగ్నిప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇక్కడి పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే మంటలు ఆర్పేందుకు ఒకటే అగ్నిమాపక వాహనం ఉండడంతో అత్యవసర వేళల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రపురం, జిన్నారం, గుమ్మడిదల మండలాలు ఉన్నా యి. పటాన్‌చెరు, పాశమైలారం, బొల్లారం, ఖాజిపల్లి, గడిపోతారం, జిన్నారం, గుమ్మడిదల, సూల్తాన్‌పూర్ ప్రాంతంలో వేలాది పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఆర్పేందుకు పటాన్‌చెరులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసింది. జిన్నారం, గుమ్మడిదల ప్రాంతాలు పటాన్‌చెరుకు సుమారు 30 కిల్లోమీటర్ల దూరంలో ఉంటాయి. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరిగినప్పుడు పటాన్‌చెరు, నర్సాపూర్ నుంచి అగ్నిమాపక యంత్రాలు వెళ్లేసరికి జరగాల్సిన నష్టం జరుగుతున్నది. వేసవిలో రసాయన పరిశ్రమల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయి. పాశమైలారంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న భారీ పరిశ్రమల యాజమాన్యాలు కొన్ని సొంతంగా అగ్నిమాపక వాహనాలు సమకూర్చుకున్నాయి. కానీ, చిన్నచిన్న పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు పటాన్‌చెరు నుంచి వచ్చే ఒక్క అగ్నిమాపక వాహనమే ఉండడంతో ఆస్తి,ప్రాణ నష్టం ఎక్కువగా జరుగుతున్నాయి. భారీ ప్రమాదాలు జరిగిన సమయంలో బీహెచ్ఈఎల్, నర్సాపూర్, జీడిమెట్ల నుంచి అగ్నిమాపక వాహనాలను తీసుకువచ్చిన సంఘటనలు ఉన్నాయి.

పటాన్‌చెరులోని అగ్నిమాపక కేంద్రం

పటాన్‌చెరులో అగ్నిమాపక కేంద్రం..

పటాన్‌చెరులోని అగ్నిమాపక కేంద్రంలో ఉన్న ఒక్క అగ్నిమాపక వాహనం ద్వారా పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదల మండలాలకు సేవలు అందిస్తున్నారు. వేలాది పరిశ్రమలకు నెలవైన పటాన్‌చెరులో పారిశ్రామిక ప్రాంతంలో ఒక్క అగ్నిమాపక వాహనం ద్వారా సేవలు సరిపోవడం లేదు. పటాన్‌చెరు, పాశమైలారం, బొల్లారం, గడిపోతారం, ఖాజీపల్లి, ఐడీఏ బొల్లారం ప్రాంతంలోని పరిశ్రమల్లో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రసాయన పరిశ్రమల్లో వేసవి కాలంలో ఎక్కువగా ప్రమాదాలు జరిగి ఆస్తి నష్టం జరుగుతున్నది. పరిశ్రమల్లో రియాక్టర్లు, బాయిలర్లు పేలడం, పొగగొట్టాలు, ఇతర యంత్రాల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటే వెంటనే అప్రమత్తం చేసే సాంకేతికత ఏర్పాటు చేయడం లేదు. వేసవిలో ఎక్కువగా పరిశ్రమల్లో గ్యాస్ లీకేజీ ఆస్కారం ఉండడంతో ఎప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. పరిశ్రమల్లో కార్మికులు పనిచేసే ప్రాంతంలో తగిన భద్రత చర్యలు తీసుకోక పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. పరిశ్రమల్లో సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగి ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతున్నాయి. వేసవిలో ఎండతో పాటు పరిశ్రమల్లో ఉష్ణోగ్రతలు పెరిగి రియాక్టర్లు, బాయిలర్లు పేలిపోయి ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రమాదాలు జరిగిన సమయంలో అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందించినా, పటాన్‌చెరు నుంచి ఒక్క అగ్నిమాపక వాహనం వచ్చినా పెద్దగా ఉపయోగం లేకుండా పోతున్నది. భారీగా ఆస్తి నష్టం జరుగుతున్నది. జిన్నారం, గుమ్మడిదల ప్రాంతాల్లో మరో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని పరిశ్రమల వర్గాలు కోరుతున్నాయి.

గుమ్మడిదల మండలం మంబాపూర్ శివారులోని పేపరు మిల్‌లో అగ్ని ప్రమాదం (ఫైల్)

తూతూమంత్రంగా ఇసుక ఫిల్టర్లపై దాడులు

బ్యాతోల్‌లో ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేయిస్తున్న ఆర్ఐ (ఫైల్)

కంది, ఏప్రిల్ 13: సంగారెడ్డి జిల్లా కంది మండలంలో అక్రమ ఇసుక ఫిల్టర్ల దందా జోరుగా సాగుతున్నది. ఆరుట్ల, బ్యాతోల్, చిద్రుప్ప పరిధిలో మట్టి నుంచి నాణ్యత లేని కృత్రిమ ఇసుకను తయారు చేస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. వార్తా కథనాలు వచ్చినప్పుడే మండల రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా ఇసుక ఫిల్టర్లపై దాడులకు వెళ్లడం, ధ్వంసం చేసినట్లు ఫొటోలు పెట్టడం పరిపాటిగా మారింది. మరుసటి రోజు నుంచి ఆ ఫిల్టర్లు యథావిధిగా కొనసాగడం ఆనవాయితీగా మారింది. ఫిల్టర్లను సీజ్ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నామమాత్రంగా సామగ్రికి నష్టం కలగనీయకుండా ధ్వంసం చేయడం, అధికారులు అక్కడికి చెరుకునేసరికి అక్కడ ఫిల్టర్ల నిర్వాహకులు ఉండకపోవడం, ఇసుక రవాణా చేసే వాహనాలు ఉండక పోవడం విశేషం. వారికి ముందస్తు సమాచారం ఉండటం వల్లే ఎలాంటి నష్టం లేకుండా తప్పించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అధికార పార్టీ నాయకులు, మండల అధికారుల అండదండలతోనే అక్రమ ఇసుక వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బ్యాతోల్, ఆరుట్ల, చిద్రుప్ప గ్రామాల పరిధిలోని అక్రమ ఇసుక ఫిల్టర్లపై ఇటీవల రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ కాకుండా ఆర్ఐ మాత్రమే తూతూమంత్రంగా ఫిల్టర్లపై దాడులు జరిపారు. ధ్వంసం చేసినట్లు ఫొటోలు దిగడం తప్పా ఈ వ్యాపారాన్ని మాత్రం నియంత్రించలేక పోతున్నారని ఆరోపణలు ఉన్నాయి. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలు తవ్వారు.. వంతెన మరిచారు

అవతల వైపు పొలాలకు వెళ్లాలంటే సర్కస్ ఫీట్ చేయాల్సిందే

- పొలాల్లోకి వెళ్లే రైతులకు తప్పని తిప్పలు

రాయపోల్, ఏప్రిల్ 13: సాగునీటి సరఫరా కోసం అధికారులు కాలువలు తవ్వించారు. కానీ, ప్రజలు కాలువ దాటేందుకు వంతెన నిర్మించడం మరిచిపోయారు. దీంతో అటువైపు వెళ్లేవారు సర్కస్ ఫీట్ చేయాల్సి వస్తున్నది. కొండపోచమ్మ సాగర్ నుంచి మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్‌కు సాగునీటిని సరఫరా చేసేందుకు దౌల్తాబాద్ మండలం అప్పాయపల్లి మీదుగా కాలువ నిర్మించారు. అప్పాయపల్లి గ్రామానికి చెందిన రైతుల పొలాలు కాలువల అవతలి వైపు ఉన్నాయి. ఆ పొలాలకు వెళ్లేందుకు గతంలో దారి ఉండేది. కాలువ నిర్మాణం పూర్తి కావడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర అడ్డంకిగా మారింది. కాలువ నిర్మాణ సమయంలో పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు, కాంట్రాకర్‌కు రైతులు మొరపెట్టుకున్నారు. కాలువ పైన అవసరమైన చోట బ్రిడ్జిలు నిర్మిస్తామని అధికారులు,కాంట్రాక్టర్ గ్రామ రైతులకు హామీ ఇచ్చారు. కానీ, కాలువ నిర్మాణం పూర్తి చేసి వంతెనలు నిర్మించకుండా వదిలేశారు. దీంతో ప్రతిరోజు పొలాలకు వెళ్లే రైతులు,కూలీలు ఓ వైపు నుంచి ఎక్కి వెళ్తున్నారు. ప్రతిరోజు సర్కస్ ఫీట్ చేయాల్సి వస్తున్నది. పొలాలకు వెళ్లే వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యువకులు మోసుకెళ్తే గాని కాలువ దాటే పరిస్థితి లేకుండా పోయింది. అధికారులు వెంటనే స్పందించి కాలువపై అవసరమైన చోట వంతెనలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దౌల్తాబాద్ మండలం అప్పాయపల్లి వద్ద కాలువపై బ్రిడ్జిలేక వృద్ధుడిని దాటిస్తున్న యువకుడు